కూకట్‌పల్లి రైతుబజార్‌లో కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ, జూలై 12 : కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో శుక్రవారం కూరగాయల ధరలు (కేజీ–రూపాయలు) కింది విధంగా ఉన్నాయి. టమాట 47, వంకాయ 28, బెండకాయ 35, పచ్చిమిర్చి 55, బజ్జిమిర్చి 45, కాకరకాయ 45, బీరకాయ 28, క్యాబేజి 28, ఫ్రెంచ్ బీన్స్ 75, క్యారెట్ 35, కాలీఫ్లవర్ 23, దొండ 35, చిక్కుడు 85, గోరుచిక్కుడు 45, బీట్‌రూట్ 21, క్యాప్సికం 55, ఆలుగడ్డ 37, కీరా 23, దోసకాయ 21, సొరకాయ 11, పొట్లకాయ (1) 18, కందగడ్డ 55, ఉల్లిపొరక 65 , ఉల్లిగడ్డ 39, మామిడికాయ(1) 15 నుంచి 20, అరటికాయ(1) 8 నుంచి 10, చామగడ్డ 35, ముల్లంగి (1) 4 నుంచి 5, మొరంగడ్డ 40, గుమ్మడికాయ 30, నిమ్మకాయలు(12) 50 నుంచి 60, మునగకాయ(1) 10 నుంచి 12, పొప్పడికాయ 40, పుట్టగొడుగులు (200గ్రా.) 40, ఎండుమిర్చి 220, అల్లం 200, వెల్లుల్లి 240, చింతపండు 140, కరివేపాకు 80గా ఉన్నాయి. ఈ ధరలు నేటి ఉదయం 9.30 గంటల వరకు రైతుబజార్‌లో అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.

యువకుడు అదృశ్యం

బాలశ్రీనాథ్

జగద్గిరిగుట్ట, జూలై 12: ఇంటి నుంచి వెళ్లిన ఓ యువకుడు అదృశ్యమైన ఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ క్రాంతికుమార్ తెలిపిన ప్రకారం.. జగద్గిరిగుట్ట సమీపం ఆర్పీకాలనీలో నివాసముండే బాలకృష్ణ ప్లంబర్‌గా పని చేస్తాడు. ఇతడి కుమారుడు శేష వెంకటబాలశ్రీనాథ్(24) ప్రైవేటు ఉద్యోగి. ఈ నేపథ్యంలో ఈనెల 10న డ్యూటీకి వెళ్లిన శేషవెంకటబాలశ్రీనాథ్ తిరిగి రాలేదు. ఆచూకీ కోసం చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించినా ఫలితంలేక పోయింది. దీంతో అతని తండ్రి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గేమింగ్ అడ్డాపై ఎస్‌ఓటీ పోలీసుల దాడులు

పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు, సెల్‌ఫోన్లు, పేకాట కార్డులు

జీడిమెట్ల, జూలై 12: గాంధీనగర్‌లోని గేమింగ్ అడ్డాగా మారిన కవిత ఎయిర్ ఎక్విప్‌మెంట్‌పై సైబరాబాద్ ఎస్‌ఓటీ పోలీసులు శుక్రవారం దాడులు చేశారు. ఈ దాడుల్లో ఎనిమిది మందిని అరెస్టు చేసి, రూ.4లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. గత ఆరు నెలలుగా సతీశ్‌కుమార్ గౌడ్ అనే వ్యక్తి ఆధ్వర్యంలో ఈ గేమింగ్ అడ్డా నిర్వహిస్తున్నారు. సమాచారం అందుకున్న ఎస్‌ఓటీ పోలీసులు దాడులు చేసి, నిందితులను పట్టుకున్నారు. తదుపరి దర్యాప్తు నిమిత్తం ఎస్‌ఓటీ పోలీసులు ఈ కేసును జీడిమెట్ల పోలీసులకు అప్పగించారు.

ఫైర్ సర్వీసెస్ డీజీగా నారాయణరావు బాధ్యతలు

బాధ్యతలు చేపడుతున్న జీవీ నారాయణరావు

శేరిలింగంపల్లి, జూలై 12: రాష్ట్ర డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఫైర్ సర్వీసెస్ అడిషనల్ డైరెక్టర్ జీవీ నారాయణరావుకు పదోన్నతి కల్పించడంతో ఆ సంస్థ డైరెక్టర్‌గా ఆయన బాధ్యతలు చేపట్టారు. శుక్రవారం నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్‌లోని ఆ సంస్థ కార్యాలయంలో ఆయన ఈ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బహుళ అంతస్తుల భవనాల్లో అగ్ని ప్రమాదాలు చోటుచేసుకుంటే సత్వరమే సహాయక చర్యలు చేపట్టేందుకు 100 మీటర్ల ఎత్తైన బాహుబలి బ్రొంటో స్కై లిఫ్ట్ త్వరలో అందుబాటులోకి తేవడం జరుగుతుందన్నారు. నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్, ఐటీ కారిడార్, కోకాపేట, నియోపోలీస్ తదితర ప్రాంతాల్లో 50 అంతస్తులకు పైగా నిర్మాణాలు అందుబాటులోకి రానున్నాయన్నారు. ప్రమాదవశాత్తు ఏదైనా అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు సహాయక చర్యలు చేపట్టేందుకు ఈ తరహా బాహుబలి స్కైలిఫ్టులు అవసరమని, ఇందుకోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని తెలిపారు. ప్రస్తుతం ఒకటి 30 మీటర్లు, రెండు 54 మీటర్ల ఎత్తున్న బ్రొంటో స్కై లిఫ్టులు అందుబాటులో ఉన్నాయన్నారు. 450 మంది శిక్షణ పూర్తి చేసుకున్న ఫైర్‌మన్‌లు త్వరలో విధుల్లో చేరనున్నట్లు పేర్కొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే దోమల నియంత్రణ

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లిలో తన నివాసంలో పూలకుండీల్లో నీటిని తొలగిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

రసాయనాలు స్ప్రే చేస్తున్న ఎమ్మెల్యే. చిత్రంలో కార్పొరేటర్ సత్యనారాయణ, డీసీ కృష్ణయ్య

కేపీహెచ్‌బీ కాలనీ, జూలై 12 : దోమలను నియంత్రించాలంటే ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎమ్మెల్యే కృష్ణారావు అన్నారు. శుక్రవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే నివాసంలో జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ సిబ్బంది చేపట్టిన ఫ్రైడే..డ్రైడే కార్యక్రమాన్ని కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, డీసీ కృష్ణయ్య, ఎస్‌డబ్ల్యూఎం డీసీ మోహన్‌రెడ్డి, ఏఎంహెచ్‌వో మమత ప్రారంభించారు. ఇంటి పరిసరాలలోని పూలకుండీలలో నీటిని తొలగించడంతోపాటు రసాయనాలను స్ప్రే చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇంటి పరిసరాలలో పూలకుండీలలో నీటిని ఆవాసాలుగా మార్చుకుని దోమలు వృద్ధి చెందుతాయని, నిరుపయోగ వస్తువులు, పూలకుండీలలో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమల బెడదతో డెంగీ, మలేరియా లాంటి విషజ్వరాల బారినపడే అవకాశముందని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా మార్చుకోవాలని కోరారు. ప్రతి ఆదివారం పది నిమిషాలు కేటాయించి ఇంటి పరిసరాలలో నీటి నిల్వలను తొలగించాలన్నారు. కార్యక్రమంలో ఎంటమాలజీ ఏఈ ఉషా, ఈఎఫ్‌ఏలు, సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులు వలంటీర్లుగా సేవలందించాలి

దోమలు వృద్ధిచెందే విధానం. దోమలు వృద్ధితో వచ్చే సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు విద్యార్థులు వలంటీర్లుగా సేవలందించాలని కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ అన్నారు. శుక్రవారం బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని జనతానగర్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జడ్సీ అపూర్వ చౌహాన్, ఎస్‌బ్ల్యూఎం డీసీ మోహన్‌రెడ్డి, ఏఎంహెచ్‌వో సాల్మన్‌రాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జడ్సీ మాట్లాడుతూ... ఇంటి పరిసరాలలో నీటి నిల్వలను తొలగించి పరిశుభ్రంగా మార్చుకోవాలని.. దోమల నియంత్రణ ఉద్యమంలో అందరూ భాగస్వులు కావాలని కోరారు. వర్షాకాలంలో వర్షంనీరు ఇంటి ఆవరణలో నిరుపయోగంగా ఉన్న టైర్లు, డబ్బాలలో చేరుతుందని, ఈ నీటిని ఆవాసాలుగా మార్చుకుని దోమలు వృద్ధి చెందుతాయన్నారు. దోమలను లార్వా దశలోనే నియంత్రించే దిశగా ఎంటమాలజీ విభాగం పని చేస్తుందన్నారు. ఇంటి ఆవరణలో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. విద్యార్థులు ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా చేసేందుకు తల్లిదండ్రులకు, స్థానిక ప్రజలకు అవగాహన కల్పించాలని, దోమలతో వచ్చే సమస్యలు ప్రజలకు వివరించాలన్నారు. దోమల నియంత్రను అందరూ బాధ్యత తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఎంటమాలజీ సిబ్బంది ఉన్నారు.

బాలాజీనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న జడ్సీ అపూర్వచౌహాన్

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

బాధిత కుటుంబానికి సీఎం సహాయనిధి మంజూరు పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

మాదాపూర్, జూలై 12: హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని సాయినగర్‌కు చెందిన మహ్మద్ అబ్దుల్ జఫ్ఫార్ అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా.. మంజూరైన రూ.1.5ఎల్‌ఓసీ పత్రాన్ని ఆయన నివాసంలో బాధిత కుటుంబానికి స్థానిక ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేసిందన్నారు. అనారోగ్యానికి గురై ఆర్థిక స్థోమత లేక దవాఖాన చికిత్స పొందిన నిరుపేదలకు, అభాగ్యులకు అండగా సీఎం సహాయనిధి ఆర్థిక భరోసానిస్తుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీకి బాధిత కుటుంబసభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

టీఎస్ఎఫ్‌డీసీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన పొదెం

బాధ్యతలు చేపట్టిన వీరయ్యకు శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి ఉత్తమ్

శేరిలింగంపల్లి, జూలై 12: తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్‌గా ఏఐసీసీ సభ్యుడు, టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు పొదెం వీరయ్య శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కొత్తగూడలోని బొటానికల్ గార్డెన్‌లోని టీఎస్ఎఫ్‌డీసీ కార్యాలయంలో ఆయన ఈ బాధ్యతలు తీసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ఇరిగేషన్ శాఖమంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబులు పొదెం వీరయ్య ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరై శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బొటానికల్ గార్డెన్‌లో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, అశ్వారావుపేట ఎమ్మెల్యే ఆదినారాయణ, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, మాజీ ఎమ్మెల్యే బాలసాని లక్ష్మీనారాయణ, గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ట్రైకార్ చైర్మన్ బెల్లయ్యనాయక్, హస్తకళ చైర్మన్ నాయుడు సత్యం, టీఎస్ఎఫ్‌డీసీ ఎండీ చంద్రశేఖర్ రెడ్డి తదితర ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

దోమలను నియంత్రించాలని జడ్సీకి వినతి

కూకట్‌పల్లి జడ్సీని కలిసిన సైబర్‌సిటీ రెయిన్‌బో విస్టాస్ రాక్‌గార్డెన్ రెసిడెన్షియల్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు

కేపీహెచ్‌బీ కాలనీ, జూలై 12: బాలాజీనగర్ డివిజన్‌లోని చెరువులలో పేరుకుపోయిన గుర్రపు డెక్కను తొలగించి దోమల వృద్ధిని నియంత్రించాలని కోరుతూ.. కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌కు సైబర్ సిటీ రెయిన్‌బో విస్టాస్ రాక్‌గార్డెన్ రెసిడెన్షియల్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు వినతి పత్రం అందించారు. శుక్రవారం జడ్సీకి శుభాకాంక్షలు తెలిపి.. స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న దోమల సమస్యపై వినతిపత్రం అందించారు. గేటెడ్ కమ్యూనిటీ కాలనీ సమీపంలో కాముని, మైసమ్మ, ముళ్లకత్వ చెరువులు ఉన్నాయని, ఆ చెరువులలో గుర్రపు డెక్కను ఆవాసంగా చేసుకుని దోమలు వృద్ధి చెందుతున్నయన్నారు. దీంతో ప్రజలు నిద్రలేని రాత్రులను గడపాల్సి వస్తుందన్నారు. ఈ చెరువులలో ఏపుగా పెరిగిన గుర్రపు డెక్కను ప్రతియేటా తొలగించే వారని.. ఈ ఏడాది గుర్రపు డెక్కను తొలగించని కారణంగా దోమలు బాగా వృద్ధి చెందాయన్నారు. గేటెట్ కమ్యూనిటీ కాలనీలో 4,300 అపార్ట్‌మెంట్ ఫ్లాట్స్ నివాసితులతో పాటుగా కైత్లాపూర్, రాఘవేంద్ర కాలనీ, సేవాలాల్‌నగర్, మైస్టిక్‌హిల్స్, ఆంజనేయనగర్, సఫ్దర్‌నగర్, గాయత్రినగర్, మూసాపేట పరిసర ప్రాంతాల ప్రజలు దోమలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. గుర్రపు డెక్కను తొలగించాలని, లార్వా దశలోనే దోమలను నియంత్రించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు బండి మధుసూదన్‌రెడ్డి, రామిడి ప్రమోద్‌రెడ్డి, టి.రామ్‌కిరణ్, పూసపాటి దీప్తి తదితరులు ఉన్నారు.

గుర్రపుడెక్కను త్వరగా తొలగించాలి

చాకలి చెరువును సందర్శించి డీసీ

శేరిలింగంపల్లి, జూలై 12: శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని చాకలిచెరువులో కొనసాగుతున్న గుర్రపుడెక్క తొలగింపు పనులను శుక్రవారం ఉప కమిషనర్ రజనీకాంత్ రెడ్డి పరిశీలించారు. ఎఫ్‌టీసీ యంత్రం సాయంతో గత కొద్ది రోజులుగా గుర్రపుడెక్కను జీహెచ్‌ఎంసీ సిబ్బంది తొలగిస్తున్నారు. చాకలిచెరువును సందర్శించి గుర్రపుడెక్క తొలగించే పనుల వివరాలు ఈ సందర్భంగా అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన పనులు పూర్తిచేయాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. దోమల నివారణ చర్యల్లో భాగంగా గుర్రపుడెక్కను తొలగించడంతోపాటు చెరువులో ఆయిల్‌బాల్స్‌ను విడిచారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి సర్కిల్ ఎంటమాలజీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

శేరిలింగంపల్లి చాకలిచెరువులో కొనసాగుతున్న గుర్రపుడెక్క తొలగింపు పనులను పరిశీలిస్తున్న సర్కిల్ డీసీ రజనీకాంత్ రెడ్డి

భక్తిశ్రద్ధలతో మొహర్రం జరుపుకుందాం

దుండిగల్, జూలై 12 : మొహర్రం వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకుందామని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి(కేఎస్ఆర్) అన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప సముదాయానికి చెందిన పలువురు ముస్లిం సోదరులు కేఎస్ఆర్‌ను శుక్రవారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఈనెల 17వ తేదీన జరుగనున్న మొహర్రం నిర్వహణకు సంబంధించిన వివరాలను తెలియజేశారు. అదే విధంగా 12వ డివిజన్ ఇందిరమ్మకాలనీ ఫేజ్–1కు చెందిన ప్రజలు కేఎస్ఆర్‌ను కలిసి తమ బస్తీలోని సమస్యలను పరిష్కరించాలని కోరారు. అంతకు ముందు ఆయన దుర్గామాత ఆలయంలో కొలువుదీరిన వారాహీదేవిని దర్శించుకుని పూజలు చేశారు.

దక్షిణ, పశ్చిమ మండలం డీసీపీగా చంద్రమోహన్ బాధ్యతలు

ప్రజలకు శాంతి, భద్రతలను అందించడానికి కృషి చేస్తానని దక్షిణ, పశ్చిమ మండలం నూతన డీసీపీ చంద్ర మోహన్ అన్నారు. ఇక్కడ పనిచేస్తున్న ఉదయ్‌కుమార్‌రెడ్డి బదిలీపై వెళ్లడంతో శుక్రవారం చంద్రమోహన్ శుక్రవారం పదవీబాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ శాంతి, భద్రతలను రక్షించడానికి చాయశక్తులా కృషి చేస్తానని పేర్కొన్నారు. పోలీసులు తమ విధులలో బాధ్యతగా వ్యవహరిస్తూ ప్రజలకు ఉత్తమ సేవలందించేలా చూస్తానని అన్నారు.

– మెహిదీపట్నం జూలై 12

నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ కమిటీ నేతల మూకుమ్మడి రాజీనామా



పదవులకు రాజీనామా ప్రకటిస్తున్న సతీశ్ తదితరులు

దుండిగల్, జూలై 12 : నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు ఆకుల సతీశ్‌తో పాటు కమిటీలో ఉన్న వివిధ విభాగాల నాయకులు తమ పదవులకు శుక్రవారం మూకుమ్మడిగా రాజీనామా చేశారు. ఈనెల 9వ తేదీన కార్పొరేషన్ పరిధిలోని మూడు గ్రామాలైన నిజాంపేట్, ప్రగతినగర్, బాచుపల్లి గ్రామాలకు అధ్యక్షులను నియమిస్తూ జిల్లా కన్వీనర్ డా.ఎస్.మల్లారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయంలో నిజాంపేట్ కార్పొరేషన్ కమిటీ అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పటికీ పట్టించుకోకపోవడంపై నిరసన వ్యక్తం చేస్తూ తమ పార్టీ పదవులకు రాజీనామా చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ ప్రధాన కార్యదర్శి గొల్ల కృష్ణ, రాష్ట్ర మైనార్టీ కార్యవర్గ సభ్యులు కాశి, సెక్రటరీ అరుణ్‌రావు, కోశాధికారి శ్రీనివాసరావు, సోషల్ మీడియా కో–కన్వీనర్ విజయ్‌కుమార్, తిలోక్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు రాము, మహిళా మోర్చా అధ్యక్షురాలు కవితరెడ్డి, ఓబీసీ మోర్చా జనరల్ సెక్రటరీ ముఖేష్, ఉపాధ్యక్షుడు కుమార్ గౌడ్, కిసాన్‌మోర్చా ఉపాధ్యక్షుడు, ట్రేడర్ సెల్ కన్వీనర్ ఈశ్వర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు, సతీశ్‌కృష్ణ, పట్నాయక్, డివిజన్ అధ్యక్షుడు మాధవరావు, ప్రదీప్ కుమార్, ఎల్లస్వామి, శ్రీనివాస్, హనుమయ్య, చిరంజీవి, మోక్షశ్రీ, నరోత్తంరెడ్డి, వెంకటేశ్, కృష్ణ, జి.రాజేశ్, వరుణ్‌రెడ్డి, నవీన్, సందీప్, యాకూబ్, సుధాకర్, మహేశ్, అనునియ రాజీనామా సమర్పించారు. అయితే నిజాంపేట్ కార్పొరేషన్ అధ్యక్షులుగా నియమితులైనప్పటి నుంచి ఆకుల సతీశ్ ఏకపక్ష విధంగా నిర్ణయాలు తీసుకోవడంతో పాటు తన ప్రత్యేక ఎజెండాతో ముందుకు పోవడంతోనే పార్టీలోని సీనియర్ నాయకులు ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తుంది. పైకి పార్టీ సౌలభ్యం కోసమే కార్పొరేషన్ అధ్యక్ష పదవిని మూడు విభాగాలుగా చేసినట్లు పేర్కొంటున్నప్పటికీ సతీశ్‌కు ముకుతాడు వేసేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. స్వయంగా పార్టీ జిల్లా కన్వీనరే నియామక పత్రాలు అందజేయడమే అందుకు నిదర్శనంగా నిలుస్తుందంటున్నారు.

రోడ్డు విస్తరణ మరమ్మతు పనులు చేపట్టాలి

కేపీహెచ్‌బీ కాలనీ, జూలై 12 : కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలో డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని, రోడ్డు విస్తరణ, మరమ్మతు పనులను వెంటనే చేపట్టాలని కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేశ్ కోరారు. శుక్రవారం కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌ను కాంగ్రెస్ పార్టీ నేతలు శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నియోజకవర్గంలోని పలు సమస్యలను జడ్సీకి వివరించి.. పరిష్కారం కోసం కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాలనీలు, బస్తీల్లో దెబ్బతిన్న రోడ్లను బాగుచేయాలని, ఆయా ప్రాంతాలలో ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించేందుకు రోడ్లను విస్తరించాలని కోరారు. రోడ్ల వెంట చెత్తాచెదారం, నిర్మాణ వ్యర్థాలు, పిచ్చి మొక్కలను తొలగించాలన్నారు. చెరువులో గుర్రపుడెక్కను తొలగించాలని, నీటి నిల్వలు ఉన్నచోట ఆయిల్‌బాల్స్ వేయాలని, లార్వా దశలోనే దోమలను నియంత్రించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్లపై అక్రమణలను తొలగించాలని, అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ వీధి దీపాలు వెలిగేలా చేయాలని, అవసమైన చోట కొత్తవి ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గం మాజీ అధ్యక్షుడు శేరి సతీశ్ రెడ్డి, తూము వేణు, జి.వెంకటేశ్వర్‌రావు, లక్ష్మణ్, విఠల్‌రెడ్డి, రాఘవేందర్‌రావు, ప్రవీణ్‌కుమార్, కృష్ణ, సతీశ్ గౌడ్, మొహినుద్దీన్, రమేశ్‌కుమార్, మహేశ్ యాదవ్, మధుగౌడ్, రమేశ్, పుష్పారెడ్డి, సంతోష్‌కుమార్, సునీల్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న బండి రమేశ్, సతీశ్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, వేణు, లక్ష్మణ్ తదితరులు

నైపుణ్యం పెంచుకుంటేనే ఉజ్వల భవిష్యత్

అప్రెంటిస్ మేళాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

దుండిగల్, జూలై 12: విద్యార్థులు తమ నైపుణ్యతను పెంపొందించుకున్నప్పుడే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, బహదూర్‌పల్లిలోని కేఎం.పాండు గవర్నమెంట్ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో నిర్వహించిన అప్రెంటిస్ మేళాకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత పోటీ సమాజంలో వృత్తి విద్యా కోర్సులకు ఎంతో ఆదరణ ఉందన్నారు. విద్యార్థులు చదువులో ఇతరులతో పోటీపడుతూ నైపుణ్యతను పెంపొందించుకున్నప్పుడే బంగారు భవిష్యత్తు లభిస్తుందన్నారు. కుత్బుల్లాపూర్‌లో ఇప్పటికే జూనియర్ కళాశాల, ఒకేషనల్ కళాశాలను ఏర్పాటు చేశామని, రానున్న రోజుల్లో డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే స్థలాన్ని పరిశీలించామన్నారు. అతి త్వరలోనే డిగ్రీ కళాశాల పనులకు శంకుస్థాపన చేస్తామన్నారు. కార్యక్రమంలో రీజినల్ జాయింట్ డైరెక్టర్ జయప్రద భాయి, సివ జ్యోత్స్నరాణి, కళాశాల ప్రిన్సిపాల్ మైమూన్, తిరుపతయ్య, స్కిల్ డెవలప్‌మెంట్ రీజినల్ డైరెక్టర్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా నిజాంపేట్ కార్పొరేషన్ సర్వసభ్య సమావేశం

సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద్, మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డి తదితరులు

దుండిగల్, జూలై 12 : నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ 25వ సాధారణ సర్వసభ్య సమావేశం శుక్రవారం మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డి అధ్యక్షతన సాదాసీదాగా జరిగింది. ముఖ్యఅతిథిగా కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ.వివేకనంద్ హాజరైన ఈ సమావేశంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్, 33 డివిజన్ల పరిధిలోని కాలనీలు, బస్తీల్లో చేపట్టాల్సిన మౌలిక సదుపాయాలు, నిధులు, పెండింగ్‌లో ఉన్న పనులపై చర్చించారు. అదేవిధంగా తాగునీరు, డ్రైనేజీ, రోడ్డు ఏర్పాటు వంటి సమస్యలపై చర్చించారు. బోనాల పండుగ నిర్వహణ ఏర్పాట్లతోపాటు వర్షాకాలంలో సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగు సలహాలు, సూచనలతో సమావేశం ముగిసింది. ఈ సమావేశంలో బాచుపల్లి తహసీల్దార్ పూల్‌సింగ్, నిజాంపేట్ కార్పొరేషన్ కమిషనర్ రామకృష్ణారావు, డిప్యూటీ మేయర్ ధన్‌రాజుయాదవ్‌తో పాటు వివిధ డివిజన్‌ల కార్పొరేటర్లు, కో–ఆప్షన్ సభ్యులు, ఇంజినీరింగ్, శానిటేషన్, టౌన్‌ప్లానింగ్, వాటర్‌వర్క్స్, రెవెన్యూ, హార్టికల్చర్, ఎలక్ట్రికల్, పోలీస్, ఇతర ముఖ్య విభాగాల సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు శంభీపూర్‌రాజును కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు, బీఆర్ఎస్ కార్యకర్తలు శుక్రవారం శంభీపూర్‌లోని ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలంటూ ఎమ్మెల్సీకి విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన ఆయన ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేస్తున్నామని, అందులో భాగంగానే నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. – దుండిగల్, జూలై 12

క్యారమ్, చెస్ పోటీలు నిర్వహించడం అభినందనీయం

ఓల్డ్‌బోయిన్‌పల్లి కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్

క్యారమ్ ఆడి పోటీలను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ నర్సింహ యాదవ్

బాలానగర్, జూలై 12:సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్యారమ్, చెస్ పోటీలు నిర్వహించడం అభినందనీయమని ఓల్డ్‌బోయిన్‌పల్లి కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని పీవీ ఎన్‌క్లేవ్ కమ్యూనిటీహాల్‌లో సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్యారమ్, చెస్ పోటీలకు కార్పొరేటర్ నర్సింహ యాదవ్ హాజరై ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన స్వయంగా క్యారమ్ ఆడి సీనియర్ సిటిజన్స్‌ను సంబురపరిచారు. ఈ పోటీలకు 150 మంది సీనియర్ సిటిజన్స్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమ అధ్యక్షుడు బానయ్య, జనరల్ సెక్రటరీ శేషసాయి, పీవీ ఎన్‌క్లేవ్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్యామ్‌సుందర్, సూర్యప్రకాశ్, సుధాకర్‌రావు, విజయ్‌కుమార్‌లతో పాటు కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వైఎంసీఏ ఫిజికల్ డైరెక్టర్‌గా జార్జ్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: వైఎంసీఏ గ్రేటర్ హైదరాబాద్ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్‌గా డాక్టర్ ఎజినె జార్జ్ నియమితులయ్యారు. శుక్రవారం సమావేశమైన వైఎంసీఏ బోర్డు డైరెక్టర్లు జార్జ్ ఎంపికపై తుది నిర్ణయం తీసుకున్నారు. బాస్కెట్ బాల్ క్రీడలో జార్జ్‌కు సుదీర్ఘ అనుభవముంది. ఆటు ప్లేయర్‌గా లెక్కకు మిక్కిలి పతకాలు సాధించడంతో పాటు తన శిక్షణలో మెరికల్లాంటి ప్లేయర్లను తీర్చిదిద్దాడు. సికింద్రాబాద్ వైఎంసీఏ ఆధ్వర్యంలో పలు క్రీడల్లో ప్లేయర్లకు శిక్షణ అందించడంలో జార్జ్ కీలకంగా వ్యవహరించారు.

వివిధ కోర్సుల పరీక్షా తేదీలు ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 12: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఓయూ దూరవిద్యా కేంద్రమైన ప్రొఫెసర్ జి. రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పీజీఆర్ఆర్‌సీడీఈ) ద్వారా అందించే వివిధ పీజీ డిప్లొమా కోర్సుల పరీక్షలను ఈ నెల 25 నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.in లో చూసుకోవచ్చని సూచించారు.

ప్రశాంతంగా టీజీ సీపీజీఈటీ-2024 పరీక్షలు

రాష్ట్రవ్యాప్తంగా అన్ని యూనివర్సిటీల పరిధిలో అన్ని పీజీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే టీజీ సీపీజీఈటీ – 2024 పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. ఈ నెల 6న ప్రారంభమైన ఈ పరీక్షలు ఈ నెల 16 వరకు జరుగనున్నట్లు సీపీజీఈటీ కన్వీనర్ ప్రొఫెసర్ ఐ. పాండురంగారెడ్డి తెలిపారు. ఈ పరీక్షలు శుక్రవారం ఆరు సబ్జెక్టులకు నిర్వహించినట్లు చెప్పారు. ఈ పరీక్షలకు మొత్తం 18,411 మంది దరఖాస్తు చేసుకోగా, మొత్తం 16,542 మంది హాజరయ్యారని వివరించారు. హాజరు శాతం 89.84గా నమోదైందని పేర్కొన్నారు.